క్లుప్తంగా

ఎన్‌సీసీ క్యాడెట్లకు శిక్షణ



ఫైరింగ్‌లో శిక్షణ పొందుతూ..

వెంకటాచలం: మండలంలోని అక్షర విద్యాలయంలో ఎన్‌సీసీ క్యాడెట్లకు పది రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. తొలిరోజున ఫైరింగ్, డ్రిల్, వ్యాయామం తదితరాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ క్యాంపు కమాండెంట్ కల్నల్ కరంచంద్, రాజేష్‌కుమార్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతర



గ్రామోత్సవం నిర్వహిస్తూ..

వెంకటాచలం: మండలంలోని నిడిగుంటపాళెంలో వాడెపూడెమ్మ అమ్మవారి జాతరను కుంచి శ్రీనివాసులు యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సోమవారం ఉదయం అమ్మవారిని పూలతో అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి బోనాలు, వీరతాళ్లు, తప్పెట్లతో గ్రామోత్సవం వైభవంగా జరిగింది. ఇందులో మండలంలోని వివిధ గ్రామాల భక్తులు పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా చివరి రోజైన మంగళవారం ఉదయం 5 గంటలకు అభిషేకం , 6 గంటలకు గ్రామ దేవతకు పూలతో అలంకరణ, 8 గంటలకు గ్రామ పొంగళ్లు జరుగుతాయని శ్రీనివాసులు యాదవ్ తెలిపారు.

వీరభద్రస్వామికి విశేష పూజలు



ప్రత్యేకాలంకరణలో వీరభద్రస్వామి

మనుబోలు: వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని మండల కేంద్రంలోని వీరభద్రస్వామి ఆలయంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. అర్చకుడు శ్రీనివాసులు స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అలాగే కండలేరు ఒడ్డునున్న కామాక్షితాయి సమేత సంగమేశ్వర స్వామి ఆలయంలో అర్చకుడు ఫణీంద్రశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జాబ్ మేళా నేడు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహ సమీపంలో గల సిద్దార్థ జూనియర్ కళాశాలలో జాబ్‌మేళాను మంగళవారం నిర్వహించనున్నామని ఎంపీడీఓ శ్రీహరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాబ్‌మేళాకు పలు కంపెనీలు హాజరుకానున్నాయని చెప్పారు. ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, ఐటీఐ, బీటెక్ తదితర కోర్సులు చేసిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సమస్యలపై ఎమ్మెల్యేను చుట్టుముట్టి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని మునులపూడి పంచాయతీ రెడ్డిపాళెంలో రూ.పది లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి సోమవారం ప్రారంభించారు. కార్యక్రమం అనంతరం పలు సమస్యలపై ఆమెను గ్రామస్తులు చుట్టుముట్టారు. అర్జీలను అధిక సంఖ్యలో సమర్పించారు. ఇళ్ల స్థలాలు, పింఛన్లు రావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలోని అన్ని వీధుల్లో సీసీ రోడ్లను నిర్మించాలని డిమాండ్ చేశారు.

నూతన కమిటీల ఏర్పాటు



నెల్లూరు రూరల్: జాతీయ సమాచార హక్కు చట్టం ప్రొటెక్షన్ ఫోర్స్ కమిషన్‌కు సంబంధించిన వివిధ కమిటీలను ఏర్పాటు చేశామని సంస్థ జాతీయ అధ్యక్షుడు జిలానీ బాషా తెలిపారు. ఈ మేరకు ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో సోమవారం ఆయన మాట్లాడారు. రాష్ట్ర అధ్యక్షుడిగా చిల్లకూరు సాయి ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా మురారి మధును నియమించామన్నారు. అనంతరం నియామక పత్రంతో పాటు గుర్తింపు కార్డులను అందజేశారు.



కోలాటం.. సరికొత్తగా..

- దైవకార్యాలకు విధిగా ప్రదర్శన
- సంప్రదాయంతో పాటు కొత్తపోకడలు
- జిల్లా దాటి ప్రదర్శనలు

పొదలకూరు: సంప్రదాయ కళలు అంతరిస్తున్న సమయంలో కోలాటాన్ని కొంగొత్త పోకడలతో యువత ముందుకు తీసుకెళ్తోంది. ఇప్పటికీ చుట్టుపక్కల ప్రాంతాల్లో అగ్నిగుండ ప్రవేశం, పందిరి భజన, కోలాటాలు నిర్వహిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో దశాబ్దాలుగా కొందరు గురువులు ఖ్యాతి తీసుకొచ్చారు. ఏడు పదుల వయసులోనూ యువతతో కలిసి లయతప్పకుండా ఆడుతుండేవారు. నేటికీ శిష్యులను పోగేసి గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో దైవకార్యాలకు ప్రదర్శనలిస్తూ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు.

కాపాడుకుంటూ..

మండలంలోని మొగళ్లూరు, చెన్నారెడ్డిపల్లి, తాటిపర్తి గ్రామాల్లో కోలాటం, భజన గురువులున్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఆత్మకూరు, వింజమూరు, వెంకటగిరి, కలిగిరి, ఉదయగిరి, గూడూరు తదితర ప్రాంతాల్లో వారు కళను కాపాడుకుంటూ వస్తున్నారు. ఈ ప్రాంతంలో తిరునాళ్ల, ఉత్సవాలకు కోలాటం పోటీలను నిర్వహిస్తున్నారు. కోలాటం శారీరకంగా గొప్ప వ్యాయామం కావడంతో మహిళలు మక్కువ పెంచుకుని ప్రత్యేక శిక్షణ పొంది దైవకార్యాల సందర్భంగా తాము నేర్చుకున్న కళను ప్రదర్శిస్తున్నారు.

మూడు రకాలు..

సమయం, సందర్భం ఆయా గ్రామస్తుల అభిరుచి మేరకు కోలాటాన్ని ఆడతారు. అడుగు కోలాటం, పుల్లకోలాటం, భజన కోలాటంలో సిద్ధహస్తులున్నారు. జడ కోలాటాన్ని మొగళ్లూరుకు చెందిన కళాకారులు ప్రత్యేకంగా ప్రదర్శిస్తారు. ఇది ప్రయాసలతో కూడుకున్నది అయినా తిరునాళ్ల, జాతరల సందర్భంగా నిర్వాహకుల కోరిక మేరకు ప్రదర్శించి మెప్పిస్తున్నారు. సుబ్బరాయుడు అనే గురువు ఇప్పటి వరకు 15 బృందాలకు శిక్షణ ఇచ్చారు. ఈయన ప్రస్తుతం మంచానికే పరిమితమయ్యారు. నేడు కోలాటంలో ఆధునిక పోకడలను చొప్పించి కొందరు డీజే శబ్దాలతో ప్రదర్శిస్తున్నారు. ఇలాంటి వాటికి సైతం ఆదరణ లభిస్తోంది. సినిమా పాటలకు బాలికల చేత కోలాటం ప్రదర్శిస్తున్నారు. అంతేకాక భజన, కోలాటం రూపురేఖలు మారిపోయి మహిళలను కూడా తీసుకొచ్చి నృత్యాలను ప్రదర్శిస్తున్నారు.



బాలికల కోలాట ప్రదర్శన (ఫైల్)

నేర్పిస్తున్నాం



"సంప్రదాయ కోలాటంలో ఆధునికతను చొప్పించి కోలాటం ఆడుతున్నారు. ఇది అంత ఆమోదయోగ్యమైనది కాదు. మేము సంప్రదాయ కోలాటాన్నే దేవస్థానాల వద్ద నేర్పుతున్నాం. సినిమా పాటలకు కోలాటాన్ని ప్రదర్శిస్తే గురువులు ఒప్పుకోరు. కాలానుగుణంగా మార్పులు, చేర్పులు వచ్చి సంప్రదాయం అంతరిస్తుందనే భయం ఉంది.

– ఆకుల చినగంగిరెడ్డి, గురువు



గ్రామాల్లో తిరునాళ్ల సందర్భంగా..



శిక్షణ పొందుతూ.. (ఫైల్)

పరిష్కారం చూపండి సారూ..

మండలాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధానంగా భూ సమస్యలపై రైతులు అధికారులకు వినతులు అందజేశారు.

పొదలకూరు: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. తహసీల్దార్ బి.శివకృష్ణయ్యకు పలువురు రైతులు భూ సమస్యలపై అర్జీలను అందజేశారు. భూమి కొలతలు, పట్టాదారు పాస్ పుస్తకాలు తదితరాలపై విన్నవించారు. స్పందించిన తహసీల్దార్ సంబంధిత వీఆర్వోలకు అప్పగించి పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు.



పొదలకూరు: సమస్యలు తెలుసుకుంటున్న తహసీల్దార్

సర్వే చేయించాలని వినతి

కొడవలూరు: తన భూమికి సర్వే చేయించి సాగునీటి కాలువ సమస్యను పరిష్కరించాలని మండలంలోని బసవాయపాళేనికి చెందిన రైతు ప్రసాద్ కోరారు. ఈ మేరకు తహసీల్దార్ స్ఫూర్తిరెడ్డికి వినతి పత్రాన్ని అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. పొలంలో కాలువ నీటి వాడకంలో సమస్యలు తలెత్తుతున్న తరుణంలో సర్వే చేసి పక్కాగా విస్తీర్ణం, పొరుదలను నిర్ధారిస్తే సమస్య పరిష్కారమవుతుందని తెలిపారు.



కొడవలూరు: వినతిపత్రమిస్తున్న రైతు

గౌడ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివి 450కుపైగా మార్కులు సాధించిన గౌడ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను అందజేయనున్నామని నెల్లూరు జిల్లా గౌడ కల్లుగీత పారిశ్రామిక సంఘం, గౌడ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు తోట ప్రభాకర్, కార్యనిర్వహణాధ్యక్షుడు కోసూరు రాజశేఖర్ తెలిపారు. సుజాతమ్మ కాలనీలో విలేకరులతో సోమవారం వారు మాట్లాడారు. రూ.ఐదు వేల నగదు ప్రోత్సాహకంతో పాటు విద్యాసామగ్రిని అందజేయనున్నామని వివరించారు. దరఖాస్తులను కోసూరు రాజశేఖర్‌గౌడ్, డోర్ నంబర్ 24 – 3 – 390, సుజాతమ్మ కాలనీ, మూడో వీధి, దర్గామిట్ట, నెల్లూరు చిరునామాకు జూన్ 15లోపు పంపాలని కోరారు. ముత్యం గౌడ్, ఉప్పాల రామకృష్ణ, తాతా రమణయ్య, ఆలపాక శ్రీనివాసులు, మోర్ల వెంకటేశ్వర్లు, ఆలపాక రవి, తాతా సుబ్బారావు, నిమ్మల సుబ్బయ్య, ఉప్పాల యల్లయ్య, కోసూరు గోవింద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నేతలు

క్రీడాకారులకు టీ షర్టుల అందజేత

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహిస్తున్న హాకీ శిబిరంలో శిక్షణ పొందుతున్న వారికి టీ షర్టులను కోచ్ చందు, క్రీడాకారుడు భానుప్రకాష్ సోమవారం అందజేశారు. క్రీడాకారులు, అఖిల్, ఆది, హరీష్, లోకేష్, ఆకాష్, హితేష్, హమీద్, హఫీజ్, జయంత్ తదితరులు పాల్గొన్నారు.



అధ్యాపకులకు ప్రిన్సిపల్స్‌గా పదోన్నతి

నెల్లూరు (టౌన్): జిల్లాలోని పలు జూనియర్ కళాశాలల్లో అధ్యాపకులుగా పనిచేస్తున్న పలువురికి ప్రిన్సిపల్స్‌గా పదోన్నతి కల్పించారు. ఈ మేరకు ఉత్తర్వులను డైరెక్టర్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కృతికా శుక్లా జారీ చేశారు. పదోన్నతి పొందిన అధ్యాపకులు వెంటనే రిలీవై ఆయా కళాశాలల్లో ప్రిన్సిపల్స్‌గా బాధ్యతలు స్వీకరించాలని ఆదేశించారు. నగరంలోని కేఏసీ జూనియర్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న రమణారెడ్డిని డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా.. కేఏసీ జూనియర్ కళాశాల అధ్యాపకురాలు జయమాలతిని టంగుటూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా.. డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాల అధ్యాపకురాలు కృష్ణవేణిని రాపూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా.. గుంటూరు జిల్లా సత్తెనపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు శ్రీనివాసరావును ఉదయగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా.. పీవీపాళెం ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకురాలు లక్ష్మీజ్ఞానేశ్వరిని చేజర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా.. వెంకటాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకురాలు కరుణకుమారిని వెంగమాంబపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా పదోన్నతి కల్పించారు.

నర్సుల పాత్ర ఎనలేనిది



కేక్‌ను కట్ చేస్తున్న నర్సులు

కోవూరు: రోగులకు సేవ చేయడంలో నర్సుల పాత్ర ఎనలేనిదని జిల్లా టీబీ, ఎయిడ్స్ నివారణాధికారి ఖాదర్‌వలీ పేర్కొన్నారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో 18 మంది నర్సులను పెద్ది ప్రభావతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం సత్కరించారు. అనంతరం కేక్‌ను కట్ చేశారు. తొలుత ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ లీలావతి, ఎస్సై రంగనాథ్‌గౌడ్, డాక్టర్ వెంకటచలపతిగౌడ్, ట్రస్ట్ సభ్యులు వేముల నిఖిల్, పెద్ది హితేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- ఏడీఈ సుబ్రహ్మణ్యం

పొదలకూరు: పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పొదలకూరు విద్యుత్ ఏడీఈ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ కిలో వాట్‌కు రూ.70 వేలు ఖర్చవుతుందని, ప్రభుత్వం రూ.30 వేలు సబ్సిడీ అందజేస్తుందన్నారు. మిగిలిన రూ.40 వేలు బ్యాంక్‌లు రుణం రూపంలో ఇస్తారన్నారు. అదనపు విద్యుత్ లోడ్ వినియోగించే వినియోగదారులకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తున్నట్టు ఏడీఈ తెలిపారు. నిబంధనల ప్రకారం కిలో వాట్‌కు రూ.2,400 చెల్లించాల్సి ఉంటుందని, స్వచ్ఛందంగా అదనపు లోడు వాడుకునే వారు రూ.1,000 చెల్లిస్తే సరిపోతుందన్నారు.

కమనీయం ప్రసన్న విశ్వేశ్వరుని కల్యాణం

ఇందుకూరుపేట: మండలంలోని మైపాడులో కొలువైన అన్నపూర్ణాంబ సమేత ప్రసన్న విశ్వేశ్వరుడి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని కల్యాణాన్ని నేత్రపర్వంగా సోమవారం రాత్రి నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆలయ అర్చకుడు బందారు ప్రభాకర్‌శర్మ ఆధ్వర్యంలో జరిపారు. ఉభయకర్తలుగా స్థానికులు గంపల రామసుబ్బయ్య, కుమారులు వ్యవహరించారు. అనంతరం గజవాహనసేవ వేడుకగా సాగింది.

సమగ్ర శిక్షలో పోస్టులకు నేటి నుంచి హాజరుకావాలి

నెల్లూరు (టౌన్): సమగ్రశిక్షలో సెక్టోరల్, అసిస్టెంట్ సెక్టోరల్ పోస్టులకు సంబంధించి దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులు జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి మంగళ, బుధవా రాల్లో హాజరుకావాలని సమగ్రశిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 13న ఏఎల్ఎస్సీఓ, 14న అసిస్టెంట్ ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ ఆఫీసర్, అసిస్టెంట్ అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ (ఉర్దూ) పోస్టులకు హాజరుకావాలన్నారు.

పలువురికి ప్రసన్న పరామర్శ



ఇందుకూరుపేట: మండలంలోని కొరుటూరులో రెండు కుటుంబాలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. పార్టీ నేత వెలుగు తిరుమలరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన నివాసానికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు.

➾ కొరుటూరుపాళెంలో పార్టీ నేత పామంజి నరసింహ కుమారుడు గౌతమ్ సముద్రంలో ఈతకెళ్లి ప్రమాదశాత్తూ మృతి చెందడంతో వారిని పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఏపీఎల్డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, నేతలు షబ్బీర్, పామంజి శ్రీనివాసులు, సంగం వెంకయ్య, స్వర్ణా శ్రీనివాసులురెడ్డి, శ్రీహరికోట ప్రసాద్, కూనంగారి రమణయ్య, పరంధామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో డీఎస్సీ పుస్తకాలు



కొడవలూరులో విద్యార్థులకు అవగాహన



విడవలూరులో..

కొడవలూరు: డీఎస్సీకి సంబంధించిన నూతన పుస్తకాలు గ్రంథాలయంలో అందుబాటులో ఉన్నాయని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని లైబ్రేరియన్ రాజేశ్వరి కోరారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా కొడవలూరులోని గ్రంథాలయంలో విద్యార్థులతో క్యారమ్స్, చెస్, త్రోబాల్ తదితర పోటీలను సోమవారం నిర్వహించారు. విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు గానూ గ్రంథాలయాలు ఎంతో దోహదపడతాయని చెప్పారు. విశ్రాంత హెచ్ఎం వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

విడవలూరు: స్థానిక సాయిబాబా వీధిలోని గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ నిరూప మాట్లాడారు. చదువులతో పాటు, ఆటలు, కథలు, చిత్రలేఖనం తదితరాలను నిర్వహించనున్నామని వివరించారు.

నిమ్మతోట కంచె దహనం

- అగ్నికి ఆహుతైన 10 నిమ్మ చెట్లు

పొదలకూరు: పట్టణానికి సమీపంలోని లింగంపల్లి గ్రామానికి చెందిన రైతు అనమాల వెంకట్రామిరెడ్డికి చెందిన నిమ్మతోట కంచె సోమవారం దహనమైంది. తోటకు పడమటి వైపున కంచెను గుర్తుతెలియని వ్యక్తులు కాల్చివేసినట్టుగా రైతు వెల్లడించారు. కంచెతోపాటు తోటలోని 10 నిమ్మ చెట్లు కూడా తగులబడినట్టు చెప్పారు. ఇటీవల ఇదే తోటకు సంబంధించిన దక్షిణం వైపున కంచె కాలిపోయింది. ప్రమాదవశాత్తు జరిగి ఉంటుందని అప్పట్లో భావించారు. ఇప్పుడు మరోవైపు కంచె తగలబడడంతో గుర్తుతెలియని వ్యక్తులు కావాలనే దహనం చేశారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సమాచారం అందుకున్న పొదలకూరు ఫైర్ సిబ్బంది మంటలు పక్కతోటలకు వ్యాపించకుండా ఆర్పివేశారు. నిమ్మచెట్లు కాలిపోవడంతో రైతు వెంకట్రామిరెడ్డి ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.



కాలిపోయిన కంచె

ఈశ్వరమ్మ దేవస్థానానికి విరాళం

విడవలూరు: మండలంలోని రామతీర్థం పంచాయతీ పాతూరు గ్రామ దేవత ఈశ్వరమ్మ దేవస్థానానికి రూ.1.5 లక్షల విరాళాన్ని విడవలూరు మాజీ జెడ్పీటీసీ రమాదేవి, రామతీర్థం మాజీ సర్పంచ్ చిమటా వెంకటేశ్వర్లు దంపతులు ప్రకటించారు. తమ కుమారుడు అభిలాష్ కుమార్ జ్ఞాపకార్థం ఈ మొత్తాన్ని గ్రామ కాపులకు సోమవారం అందజేశారు. గ్రామం సుభిక్షంగా ఉండాలని కాంక్షిస్తూ పూజలు చేశారు. స్థానికులు నాటారు వెంకటేశ్వర్లు, తంబి శ్రీనివాసులు, రామలింగయ్య, పోలయ్య, నెల్లూరు చెంచురత్నం, నాటారు గోవిందయ్య, నాగేంద్ర, పురిణి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



సీహెచ్‌ఓల నిరసన ర్యాలీ

నెల్లూరు (అర్బన్): అంతర్జాతీయ నర్సుల దినోత్సవానికి ఆద్యురాలైన ఫ్లోరెన్స్ నైటింగేల్ ఫ్లెక్సీతో ఆమెను స్మరించుకుంటూ నిరసన ర్యాలీని సీహెచ్‌ఓలు సోమవారం నిర్వహించారు. సంతపేటలోని డీఎంహెచ్ఓ కార్యాలయం నుంచి గాంధీబొమ్మ మీదుగా కలెక్టరేట్ వరకు సాగింది. తమ సమస్యలు పరిష్కరించేలా ఈ మొండి ప్రభుత్వానికి చెప్పాలంటూ గాంధీ విగ్రహానికి వినతిపత్రాన్ని అందజేశారు. ఆ నాడు ఫ్లోరెన్స్ నైటింగేల్ ఎలా సేవలందించారో.. ఇప్పుడు తామూ అదే తరహాలో సేవలందిస్తున్నామని తెలియజేస్తూ కలెక్టరేట్ వద్ద స్కిట్‌ను ప్రదర్శించారు. ఈ సందర్భంగా సీహెచ్‌ఓల అసోసియేషన్ జిల్లా కో ఆర్డినేటర్ ఆదిల్ మాట్లాడారు. సేవకు ప్రతిరూపమైన మదర్ ఆఫ్ నర్సింగ్ ఫ్లోరెన్స్ నైటింగేల్ స్ఫూర్తితో తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని 15 రోజులుగా శాంతియుతంగా పోరాటం చేస్తున్నామన్నారు. తమ డిమాండ్లను పరిష్కరించేందుకు ప్రభుత్వం ముందుకు రాకపోవడం బాధాకరమన్నారు. అనంతరం యుద్ధంలో వీరమరణం పొందిన సైనికుడు మురళీనాయక్‌కు నివాళులర్పించారు. తమ సమస్యలపై కలెక్టరేట్ అధికారులకు వినతిపత్రాన్ని సమర్పించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు భానుమహేష్, ప్రధాన కార్యదర్శి రుబికా, నేతలు సుమాంజలి, మహబూబ్ జాన్, హెప్సిబా తదితరులు పాల్గొన్నారు.



డీఈఓ కార్యాలయ ఎదుట యూటీఎఫ్ ధర్నా

నెల్లూరు (టౌన్): పాఠశాలల పునర్వ్యవస్థీకరణ, బదిలీలు, పదోన్నతులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవకోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయ ఎదుట యూటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. ప్రాథమిక పాఠశాలల్లో 1:20 పద్ధతిన ఉపాధ్యాయులను నియమించాలని పేర్కొన్నారు. అన్ని ప్రాథమికోన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ పోస్టులను కేటాయించాలని వివరించారు. హైస్కూళ్లలో 300 మంది విద్యార్థులు మించితే రెండో పీడీ పోస్టును కేటాయించాలని పేర్కొన్నారు. ప్లస్ టూ స్కూళ్లలో ఖాళీగా ఉన్న పీటీటీ, స్కూల్ అసిస్టెంట్లతో భర్తీ చేశాకే బదిలీలను జరపాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ పాఠశాలల్లో అప్‌డేషన్ ప్రక్రియ చేపట్టి వెంటనే పదోన్నతులు కల్పించాలని కోరారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి శేషు, చలపతిశర్మ, నేతలు వెంకటేశ్వర్లు, సుభాషిణి, మురళీధర్‌రావు, నాగిరెడ్డి, ఖాజావలీ, శ్రావణ్‌కుమార్, గంగాధర్, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నవకోటేశ్వరరావు